ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 01.03.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే ప్రణాళికలో భాగంగా... గోదావరి పరివాహక ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

2. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు.

3. కుమ్మెర ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలంటూ డిజిపి శశిధర్ రెడ్డికి స్థానిక నాయకులు వినతి పత్రం అందజేశారు.

4. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**మంత్రి పొంగులేటి:**

ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే ప్రణాళికలో భాగంగా... గోదావరి పరివాహక ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ములుగు జిల్లా మల్లూరు శ్రీ హేమాచల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో కలిసి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మంత్రులను సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు స్వామి వారి చరిత్ర, ఆలయ విశిష్టత గురించి

మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు చింతామణి జలదారను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...

బైట్ - మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

-పీటీసీ, ములుగు

**కేటీఆర్:**

మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని హైదర్‌షాకోట్, కేకే నగర్ వాసులు నిర్వహించిన ***సేవ్ మూసీ - సేవ్ హోమ్స్*** పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 16 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. బుల్డోజర్ల భయం నీడలో పేదల కన్నీటి గాథలు వినబడుతున్నాయని, అయితే బాధితుల పక్షాన బీఆర్ఎస్ అండగా ఉంటుందని తారకరామారావు హామీ ఇచ్చారు.

-పీటీసీ, హైదరాబాద్

**కరెంట్:**

వేసవి ప్రారంభంలోనే రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. ఎన్పీడీసీఎల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిన్న గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 6,057 మెగా వాట్లు నమోదైనట్టు సీఎండీ వరుణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని 35 కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్లను ప్రారంభించడంతో పాటు, 366 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. వీటితో పాటు 7,600 ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతో పాటు, ఓవర్ లోడ్ ఉన్న 33 కేవీ 8 ఫీడర్లను విభజించి లోడ్ తగ్గించినట్లు తెలిపారు. మార్చి, ఏప్రిల్, మేలో పెరిగే డిమాండ్ ను అందుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

-ఎడిటర్/డెస్క్

**కుమ్మెర ఘటన:**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలంటూ డిజిపి శశిధర్ రెడ్డికి నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యేలు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్ వినతి పత్రం అందజేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని, దాడిపై జరిగే విచారణకు ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా పూర్తిగా సహకరిస్తామని ఎంపీ తెలిపారు.

-పీటీసీ, నాగర్ కర్నూల్

**<u>ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్:</u>**

గ్రామ సమగ్రాభివృద్ధి కోసం సర్పంచ్, ఉప సర్పంచ్‌లు సమన్వయంతో పని చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గండివేట్ గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య వాగ్వాదం తలెత్తిన నేపథ్యంలో ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలంటే సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ఇద్దరి మధ్య పరస్పర సహకారం, సమన్వయం అత్యంత అవసరమని సూచించారు. గ్రామంలో మౌలిక వసతుల నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులు ఐక్యంగా పని చేసి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పిట్లం మండలం బుర్నాపూర్‌లో పర్యటించిన చైర్మన్ వెంకటయ్య... సమస్యలపై గ్రామ ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. మార్చి 9వ తేదీన ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో బుర్నాపూర్ గ్రామ పెద్దలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

- పీటీసీ, కామారెడ్డి

**<u>ఆరు గ్యారెంటీలు:</u>**

రాష్ట్రంలోని పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందని నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని

క్యాంపు కార్యాలయంలో తిమాజీపేట మండలానికి సంబంధించిన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులని అందజేసిన అనంతరం మాట్లాడుతూ... రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ప్రభుత్వం ముందుకు వెళుతోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అనంతరం ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో, రెడ్డి సేవాసమితి భవనం ప్రారంభం కార్యక్రమంలో రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

-పీటీసీ, నాగర్ కర్నూల్

**పిటిషన్:**

క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ ఒకసారి పిటిషన్ వేసిన తరువాత ఆ కేసుకు సంబంధించిన పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేకుండా.. రెండో పిటిషన్ వేయడం చెల్లదని హైకోర్టు స్పష్టంచేసింది. పరిస్థితుల్లో మార్పు చూపలేని పక్షంలో రెండో పిటిషన్‌ను అనుమతించలేమని చెప్పింది. ఒకవేళ అలా అనుమతిస్తే అది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని స్పష్టం చేసింది. నల్లగొండ జిల్లా నకిరేకల్ కోర్టులో నడుస్తోన్న క్రిమినల్ కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ జే శ్రీనివాసరావు... ఒకసారి పిటిషన్‌పై విచారణ పూర్తయ్యాక తిరిగి అదే పిటిషన్ వేయడానికి చట్టం అనుమతించదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేశారు.

-డెస్క్/ఎడిటర్

**వైద్యుల సంఘం:**

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టేముందు సరెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజీజీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి మాట్లాడుతూ... డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ పీజీ వైద్యుల సరెండర్, విలీన ప్రక్రియ పూర్తయితే మెడికల్ కాలేజీల్లో

ఫ్యాకల్టీగా అవకాశం దక్కుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ చేపట్టకుండా అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేస్తే... వైద్యులు తమ సీనియారిటీని కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు.

-డెస్క్

**శిక్షణ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్లపల్లి మండలం, జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో.... ముత్యపు చిప్ప, పుట్ట గొడుగులు, పాల పుట్ట గొడుగుల పెంపకం, యాజమాన్యాలపై.... ఈనెల 5వ తేదీన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ సునీతా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 500 రూపాయిల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తయిన తర్వాత ధృవపత్రం అందిస్తామని చెప్పారు.

-పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**దిశ:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలనీ, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి. నగేశ్ అన్నారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ నగేశ్ మాట్లాడుతూ... ప్రభుత్వ గ్రాంట్లు, నిధుల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను రాబోయే 45 రోజుల్లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

- పిటిసి, నిర్మల్

**బదిలీ:**

వేములవాడ (సివిల్ ) డీఎస్పీగా శ్రీనివాసులును నియమిస్తూ డీజీపీ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వేములవాడ పోలీస్ సబ్ డివిజనల్ అధికారిగా ఏఎస్పి ఐపిఎస్ అధికారి రుత్విక్ సాయి ఉన్నారు. హైదరాబాద్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నుంచి డీఎస్పీ శ్రీనివాసులు ను వేములవాడకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

-పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**<u>ఖేల్ మహోత్సవం:</u>**

సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట క్రీడా పోటీలు రేపటి నుండి మార్చ్ 7 వరకు  జరుగుతాయని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో ఆయన మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడలను కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో హుజురాబాద్ నియోజకవర్గం లోని హుజురాబాద్ ZPHS హై స్కూల్ గ్రౌండ్ ఆవరణలో రేపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల వల్ల ఎంతో మంది క్రీడాకారుల ప్రతిభను  వెలికి తీసే అవకాశం ఉంటుందన్నారు.

-పిటిసి, కరీంనగర్

**<u>చట్టం-అవగాహన:</u>**

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జ్ యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలను సందర్శించిన న్యాయమూర్తి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బాలబాలికల, మహిళల సంరక్షణ చట్టాలపై విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇబ్బందులు కలిగితే 15100 నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు.

-పీటీసీ, ఆసిఫాబాద్

**<u>పోలీస్ యాక్ట్:</u>**

రాజన్న సిరిసిల్ల  జిల్లా పరిధిలో ఈరోజు నుండి నెలాఖరు వరకు అంటే 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని  జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే. ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల  జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు.

-పీటీసీ, రాజన్న  సిరిసిల్ల

**వాతావరణం**

ఈ ఏడాది వేసవిలో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశముందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే, రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు ప్రస్తుతం సాధారణ స్థితిలోనే ఉన్నాయి. మరో మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ప్రెస్ నోట్